# సెల్ఫ్ కంట్రోల్

**-కె.బి.కృష్ణ**

"మె ఐ కమిన్ సర్" అన్న పిలుపు విని రెండు సంవత్సరాల నుండి తనను విసిగిస్తున్న ఒక ఫైలు మీద వ్రాసిన ఆరు పేజీల నోట్ అనేకసార్లు చదివి చివరకు ఏం నిర్ణయం వ్రాయాలో తోచక సతమతమవుతున్న మేనేజర్ జి.యస్.రావు ఫైల్‌లోంచి తల ఎత్తకుండానే "కమిన్" అన్నారు.

"గుడ్‌మార్నింగ్ సర్. అబ్బా... ఈవేళ మీరు ఈ టీ షర్టులో అదిరిపోయారు సర్. ఎవరైనా వయసులో ఉన్న అమ్మాయి చూస్తే మీ వొళ్లో వాలిపోతుంది సర్. అంత లవ్లీగా ఉన్నారు" అంటూ ప్రవేశించాడు ఏ.వి.రావు. అతను జి.యస్.రావు గారి ఆఫీసులో అక్కౌంటెంట్. వారంరోజులుగా సెలవులో ఉన్నాడు. అతను లేక తన దగ్గర బల్లమీద చాలా ఫైల్స్ పెండింగ్‌లో ఉండిపోయాయి. అతనిమీద ఆయనకు చాలా కోపంగా ఉంది.

కానీ అతను వస్తూనే కృష్ణుణ్ణి, కుచేలుడు గుప్పెడు అటుకులతో ఎలా ఐస్ చేసేశాడో అలాగ తనెంతో మోజుపడి కొనుక్కున్న నీలంరంగు అడ్డ చారల బనీనును మెచ్చుకోవడంతో అతనిమీద ఉన్న కోపం హుష్‌కాకి అయి కూర్చుంది.

'ఛండాలంగా ఉంది బనీను. మీకు ఎందుకీ కుర్రవేషాలు, బట్టతల, ముడతలు పడ్డ ముఖం, ముసలాడికి దసరా పండుగలాగా, బఫూన్‌లా ఉన్నారు. విప్పి చావండి ఆ చారల బనీను. దానితోనే వెళ్తారా ఆఫీసుకు' అంటూ సహస్ర నామాలు చదివిన భార్య మాటలు గుర్తుకువచ్చాయి.

మౌనంగా మేనేజర్‌గార్ని గమనించిన ఏ.వి.రావు పరిస్థితిని ఎన్‌కేష్ చేసుకోవాలని తీవ్ర నిర్ణయానికి వచ్చేసాడు.

"సర్! ఒక్కసారి టైపిస్ట్ కృష్ణవేణిని అర్జంట్‌గా నోట్ టైప్ చేయాలని పిలవండి. నేనే మీ ఎదురుగా ఉంటాను. ఏం భయంలేదు. మిమ్మల్ని ఈ డ్రెస్‌లో చూసిందంటే ఫ్లాటైపోతుంది" అన్నాడు రావ్ నెమ్మదిగా మేనేజర్‌గారి చెవిలో.

గుండ్రని ముఖం, గిరజాల జుట్టు, చక్రాల్లాంటి కళ్లు, పొట్టిగా, తెల్లగా, బొద్దుగా పిటపిటలాడుతూ వాలుజడ ఊపుకుంటూ నడిచే కృష్ణవేణి అంటే ఆయనకు చచ్చేంత ఇష్టం.

"ఏమోయ్! ఈ కృష్ణవేణి కత్రినాకైఫ్‌లాగా నా గుండెల్ని తన అందచందాలతో ముక్కలు ముక్కలుగా కత్తిరించేస్తోందోయ్" అని ఆయన ఏ.వి.రావుతో అస్తమానం అంటూ ఉంటారు.

వెంటనే మేనేజర్‌గారు బెల్ కొట్టారు. అటెండర్ వస్తూనే ఆయన చేతిలో కాగితం పెట్టి "కృష్ణవేణి గారు సెలవు పెట్టారండయ్యా" అంటూ మారు మాట్లాడకుండా వెళ్లిపోయాడు.

మేనేజర్‌గారు, ఏ.వి.రావు కూడా డంగైపోయారు. విషయాన్ని మర్చిపోయేందుకు సైడ్ ట్రాక్ చేయడానికి-

"సర్! మీకో శుభవార్త. నేను ఇంక అస్తమానం సెలవులు పెట్టి మిమ్మల్ని బాధపెట్టను. నాకు పెళ్లి కుదిరింది. వచ్చే నెలలోనే పెళ్లి. మా మామగారు పెద్ద ఆఫీసరు."

"అలాగా! చాలా సంతోషం. పోనీలే నువ్వు సెలవు పెట్టినప్పుడల్లా అక్కౌంట్స్ విషయాల్లో చాలా ఇబ్బందిగా ఉంటోంది" అన్నారాయన ఏ.వి.రావుకి చేయి అందించి శుభాకాంక్షలు తెలియజేస్తూ.

"అలాగే ఇంకో శుభవార్త సర్. నేను నిన్నటి నుండి సిగరెట్లు కాల్చడం శాశ్వతంగా మానివేసాను సర్" అన్నాడు ఏ.వి.రావ్.

కాసేపు తనను వేధిస్తున్న కృష్ణవేణి అందచందాలను చూద్దామని అనుకుంటే వీలు లేకుండా కృష్ణవేణి సెలవు పెట్టడంకన్నా తన ఆఫీసులో బాంబు పెట్టినట్టు ఎవరో ఫోన్ చేసినంత షాక్ తిన్నారు మేనేజర్‌గారు ఏ.వి.రావ్ సిగరెట్లు మానేయడమనే విషయం విని.

అయినా తన ముఖంలో ఏం భావాలు కనబడనీయకుండా జాగ్రత్తపడి "డబుల్ కంగ్రాట్స్ ఏ.వి.రావ్. అయితే నిజంగానే సిగరెట్లు కాల్చవన్న మాట" అన్నారు మేనేజర్‌గారు.

"అవును సర్. మా వుడ్‌బి నెత్తిమీద చేయివేసి మరీ ప్రమాణం చేసాను" అన్నాడు.

'వాడి వుడ్‌బి నెత్తిమీద చేయివేసి ప్రమాణం చేయడంకాదు, వీడు నా నెత్తిమీద బాంబేసినంత పని చేసాడు' అనుకున్నారు మేనేజర్‌గారు.

కారణం మేనేజర్‌గారు రోజూ కాల్చే ఇరవైకి పైగా సిగరెట్లలో తొంభైశాతం ఏ.వి.రావ్ దగ్గర తీసుకునేవే.

ఏ.వి.రావ్ మంచి పనిలో ఉండగా అటెండర్ వచ్చి "మేనేజర్‌గారికి ఒకటివ్వండి" అంటూ రోజుకి ఎన్నోసార్లు వస్తుంటాడు, అతనూ ఇస్తుంటాడు ఇది మామూలే.

అటెండర్ ఎదురుగా సిగరెట్ ప్యాకెట్ ఓపెన్ చేయడం "అయ్యో! సిగరెట్లు అయిపోయాయి రావ్‌ని అడిగిపట్రా" అంటూ రోజూ మేనేజర్‌గారు చెప్పడం, ఖాళీ పాకెట్‌ను డస్ట్‌బిన్‌లో పడేయడం, అటెండర్ అటు వెళ్లగానే డస్ట్‌బిన్‌లోంచి ఖాళీపాకెట్ తీసి సొరుగులో వేసుకోడం మామూలే. ఇదంతా ఒక షో. ఒక్కోసారి ఆ సిగరెట్ పెట్టెలో మరీ బాగుండదని రెండు సిగరెట్లు పెట్టి అప్పుడప్పుడు ఏ.వి.రావుకి సిగరెట్ ఆఫర్ చేస్తుంటారాయన.

దీనివెనుకో బ్రహ్మ రహస్యం ఉంది. నెల నెలా జీతంకన్నా రెండు రెట్లు గీతం వచ్చే సీటులో అతన్ని వేయడానికి జరిగిన పోటీలో తనకు ఏబిసిడి ఆఫ్ అక్కౌంట్స్ రాకపోయినా మేనేజర్‌గారికి సిగరెట్స్ ఆఫర్ చేస్తూ అనుక్షణం వర్కు అంతా ప్రక్కాఫీసులో పని చేస్తున్న కత్తిలాంటి అక్కౌంటెంట్ వచ్చి చేసి వెళ్లిపోతుంటాడు. మరి ఏ.వి.రావుకి ఏమీరాదు కదా అంటే ఇదోరకమైన అవుట్ సోర్సింగన్నమాట.

"సర్! ఏమిటి ఆలోచిస్తున్నారు? సిగరెట్లు కాల్చకపోతే ఎలా ఉండగలవు అని అనుకుంటున్నారుకదూ?"

"అవును" అన్నారాయన.

ఆయన గొంతు చాలా లోతులోంచి వస్తున్నట్టుంది. వోసిగా వస్తున్నాయికదాని రోజూ కనీసం ఇరవై సిగరెట్లు ఊదేస్తున్నాడు. మరి వీడు ఉన్నఫళంగా సిగరెట్లు కాల్చడం మానేస్తే తాను ఇరవై సిగరెట్లు కొనుక్కోవద్దూ? ఇంకేమైనా ఉందా? ఇంట్లో దానికి తెలిస్తే బెడ్డూ ఫుడ్డూ రెండూ కట్ అని

ఆయన తెగ బాధపడిపోతున్నారు.

వెంటనే ఏ.వి.రావ్ "దానిలో ఏం రహస్యం లేదు సార్. మనిషికి తనమీద తనకు ఆత్మవిశ్వాసం ఉండాలి. సెల్ఫ్ కంట్రోల్ ఉండాలి. పైగా మీకు మరో ముఖ్యమైన విషయం చెప్పాలి. మీరు సిగరెట్లు మానేసారనుకోండి మేడమ్ మిమ్మల్ని పిచ్చపిచ్చగా లైక్ చేసేస్తారు తెలుసా? సిగరెట్ కాల్చాలనిపించినప్పుడల్లా మీరు ఒక గ్లాసు నీళ్లు బల్లమీద పెట్టుకుని రెండు గుటకలు త్రాగండి" అంటూ హితబోధ చేసి దాదాపు మేనేజర్‌గారు సిగరెట్లు మానేసేటంత కౌన్సిలింగ్ చేసేసాడు ఏ.వి.రావ్.

మేడమ్ లైక్ చేస్తారన్న విషయంలో మేనేజర్ గారు రాజీ పడిపోయి సిగరెట్లు కాల్చడం మానేసారు.

***

మర్నాడు...

ఏ.వి.రావ్ తన సీట్లో కూర్చుని తన పెళ్లి గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

మేనేజర్‌గారి కేబిన్‌లోంచి ఒక ఫైల్ తుపాకీ గుండులాగా బయటకు దూసుకువచ్చింది.

ఆ వెనుకనే తల వంచుకుని బడ్జెట్ గుమస్తా బయటకు వచ్చాడు.

అతను రావ్‌ని చూసి "ఏంట్రా బాబూ! వీడిలా అగ్గిమీద గుగ్గిలం అయిపోతున్నాడు. ఏంటో



చూడరా బాబూ. లోపలకు వెళ్లి ఒక సిగరెట్ ఆఫర్ చేయరా బాబూ'' అన్నాడు.

"నేనూ, మేనేజర్‌గారు సిగరెట్లు కాల్చడం మానేసాం నీకు తెలియదా?'' అన్నాడు రావ్ టీవీ యాడ్‌లో 'ఈ సబ్బుబిళ్ల బట్టలలో తెలుపుతప్ప మరేమీ మిగల్చదు మీకు తెలుసా?' అని గుడ్లు మిటకరించి చూసే అమ్మాయిలాగా.

"కొంప మునిగిందిరోయ్. నీ సంగతి సరేగానీ ఆయనకు ఒక సిగరెట్ ప్యాకెట్ పంపరా బాబూ. లేకపోతే ఇవ్వాళ నుంచి మన ఆఫీసులో ఫైల్సన్నీ బంతుల్లా మన ముఖాలమీద పడతాయి'' అన్నాడు.

***


రెండోరోజు...

అటెండర్ అప్పారావ్ రొప్పుకుంటూ మేనేజర్‌గారి కేబిన్‌లోంచి బయటకు వచ్చి రావ్ దగ్గర నిలబడి-



## అభినందనీయం

సినిమాల్లోనే కాదు వ్యక్తిగత జీవితంలోనూ ఓ తారకలా వెలుగొందాలనుకుంటోంది అందాలతార నయనతార. ఈమె తాను సంపాదించిన రెమ్యూనరేషన్‌తో అందరికీ ఉపయోగపడే పనులు చేయాలనుకుంటోంది. ఇంతకీ ఆమె చేయాలనుకుంటున్న సేవ ఏమిటంటే త్వరలో ఓ వృద్ధాశ్రమాన్ని నెలకొల్పబోతోందిట. ఆమె ఆలోచన అభినందనీయంగా లేదూ!




"సార్ ఫైరయిపోతున్నారండీ బాబూ. బల్లమీద గ్లాసులో నీళ్లు లేవంట. కూజా తెప్పించండి సార్. ఆయన బల్ల ప్రక్కనే పెట్టమన్నారు. అదేంటి సారూ మేనేజర్‌గారు అన్ని నీళ్లు తాగేస్తున్నారు?'' అన్నాడు.

"అదికాదోయ్. సిగరెట్లు మానేసాం మేమిద్దరం. సిగరెట్ కాల్చాలనిపించినప్పుడల్లా గ్లాసులో నీళ్లు కొంచెం తాగాలని అనుకున్నాం'' అన్నాడు రావ్.

"చాల్లెండి సార్. ప్రయోగాలు అయ్యగారిమీద చేయకండి. లోపలకు వెళ్లాలంటే భయంగా ఉంది'' అన్నాడు అప్పారావ్.

"చూడు అప్పారావ్. నువ్వు చిన్నవాడివి. నీకు తెలియదు. ఆయన ఆరోగ్యరీత్యా మనం ఈ సలహా చెప్పాము'' అని అంటున్నాడో లేదో మేనేజర్‌గారి కేబిన్‌లోంచి వేగంగా పేపరు వెయిట్ రావడం, అక్కడే నిలబడి రావ్‌తో మాట్లాడుతున్న అప్పారావు దాన్ని యువరాజ్‌సింగ్ బౌండ్రీ లైన్‌కు ముందే క్యాచ్ పట్టుకున్నట్లు పట్టుకోవడం జరిగిపోయింది. లేకపోతే అప్పారావ్‌కి హెడ్ ఇంజరీ అయిపోయేదే!

రికార్డు అసిస్టెంట్ సూర్యనారాయణ పాత ఫైలు వెతికి తెమ్మంటే తేలేదట. అందుకని అసలే సిగరెట్లు మానేసిన కోపంతో అగ్గిబుగ్గిలా ఉన్న ఆయన చేతిలో పేపరు వెయిట్ అతని మీదకు విసిరేస్తే స్ప్రింగ్ డోర్ తెరుచుకుని సూర్యనారాయణ పారిపోతే అది అప్పారావువైపు దూసుకువచ్చింది.

***

మూడోరోజు...

ఉదయం సమయం పదకొండు అయింది. పదిన్నరకే వచ్చిన మేనేజర్‌గారు అటెండెన్స్ రిజిస్టర్ తన ముందు పెట్టుకుని అస్తమానం గడియారంకేసి చూస్తూ అప్పటికే నాలుగుసార్లు మంచినీళ్లు తాగేసారు.

అప్పారావు కంగారుగా రావ్ దగ్గరకు వచ్చి "సారూ! మేనేజర్‌గారు మంచి ఊపుమీద ఉన్నారు. పచ్చిమిరపకాయ నమిలినట్లుగా మండిపోతున్నారండీ బాబూ. టైపిస్ట్ ఇంకా రాలేదు. ఇవ్వాళ్ల ఆమె ఏమైపోద్దో ఏమో చాలా లేటయింది'' అని అంటూ ఉండగానే-

టైపిస్ట్ కృష్ణవేణి రావడం, మేనేజర్‌గారి కేబిన్‌లోకి వెళ్లడం, ఏడ్చుకుంటూ మొత్తుకుంటూ, కళ్లుతుడుచుకుంటూ, ముక్కు చీదుకుంటూ పరుగులతో రావడం సినిమాలో ఒకే ఫ్రేములో చూపించినట్లు జరిగిపోయింది.

ఏ.వి.రావ్, అప్పారావ్ తదుపరి సీన్ ఏమిటోనని భయం భయంగా బిగదీసుకుని కూర్చున్నారు.

ఇంతలో సిబ్బంది గుమాస్తాకి పిలుపు వచ్చింది. పాపం అతను కొంచెం భయస్తుడు. మోస్ట్ ఒబీడియంట్ సర్వెంట్. అతను మేనేజర్‌గారి గదిలోకి వెళ్తుంటే పులిబోనులోకి మేక వెళ్తున్నట్లుగా పాపం జాలిగా చూసారు.

మరుక్షణం...

సిబ్బందికి సంబంధించిన నాలుగు సర్వీసు పుస్తకాలు, రెండు ఫైల్స్ స్ప్రింగ్ డోర్ దగ్గర నిలబడి భయంభయంగా లోపల ఏం జరుగుతుందోనని వింటున్న అప్పారావ్‌కి, ఏ.వి.రావ్‌కి ఇర్ఫాన్ పఠాన్ వేసిన బంతిలాగా వచ్చి వేగంగా తగిలాయి. ఇద్దరూ చాలా చాకచక్యంగా వాటిని దొరకబుచ్చుకున్నారు.

"ఏ.వి.రావ్‌ని పిల్వవోయ్ అప్పారావ్'' అని అరిచారు కేబిన్‌లోంచి మేనేజర్‌గారు.

ఏ.వి.రావు లోపలకు వెళ్లగానే "వాడిని సస్పెండ్ చేస్తూ ఆర్డర్ పెట్టు'' అన్నారాయన ఉగ్ర స్వరూపంతో.

"ఎవర్ని సార్?''

"అదే సిబ్బంది గుమస్తాని''

"అదేంటి సార్. ఆర్డర్ ఆయనే రాయాలికదా''

"షటప్... నాకు రూల్స్ చెబుతున్నావా? డూ వాట్ ఐ సే'' అని అరిచారా

యన.

ఏ.వి.రావ్ బయటకు వచ్చి అటెండర్ అప్పారావ్‌నీ, సిబ్బంది గుమస్తానీ, మిగతావాళ్లనీ మేనేజర్‌గారి కేబిన్‌వైపువెళ్లకుండా ఉండమని చెప్పి మళ్లీ ఆయన కేబిన్‌లోకి వెళ్లాడు ధైర్యంగా.

"ఏదీ ఆర్డర్ పెట్టావా?"

"రాస్తాను సార్"

"ఎంతసేపు రాయాలి? రెండు లైన్లు రాయడమే. నేను చెప్తాను రాయి" అన్నారాయన కోపంతో ఊగిపోతూ.

వెంటనే ఏ.వి.రావ్ బల్లమీద గ్లాసునీళ్లు ఆయనకు అందించి "ఆఫీసులో స్టాఫ్ అంతా మీరంటే భయంతో బిక్కచచ్చిపోతున్నారు. సిగరెట్లు మానేసాక రెండుమూడురోజులు ఇలాగే అసహనంగా, ఆ అలవాటు ఒక్కసారి మానేయడంతో కసిగా ఉంటుంది. కొంచెం ఓర్చుకోండి సార్. మనసును డైవర్ట్ చేసుకోండి" అని నెమ్మదిగా చెప్పాడు.

ఆయన వెంటనే "సిగరెట్లు కాల్చడం మానేసానని మీ మేడమ్ కూడా ఎంతో సంతోషిస్తోందోయ్. కానీ ఇప్పుడు నేనంటే ఇంట్లో భయపడి ఛస్తున్నారనుకో నా కోపం చూసి" అన్నారాయన.

"చూసారా సార్ ఎంత అద్భుతం జరిగిందో. మీ పెళ్లి అయ్యాక మేడమ్ మీరంటే ఎప్పుడైనా ఇలా భయపడ్డారా?"

కొంచెం మెత్తపడ్డారు మేనేజర్‌గారు. ఆయన ముఖంలో కొంచెం దరహాసం చోటు చేసుకుంది. "అవుననుకో. అయినా..." అంటూ మళ్లీ ఆయన పాత సీనులోకి వెళ్లిపోయారు.

"తలుపులు దగ్గరకు వేస్తానుగానీ... మీరు ఒక్క పదినిముషాలు మెడిటేషన్ చేసుకోండి. రిలాక్స్" అని తలుపులు వేసి బయటకువచ్చాడు ఏ.వి.రావ్.

ఆ రోజు సిబ్బంది గుమస్తా సస్పెన్షన్ గండం అలా తప్పింది.

***

నాలుగోరోజు...

"మే ఐ కమిన్ సర్" అంటూ ఒక చేతిలో సిగరెట్‌తో మరో చేతిలో బ్రీఫ్‌కేసుతో ఒక వ్యక్తి వచ్చాడు.

"నమస్తే సార్. మేం సిమెంట్ సప్లై చేసాం. మాకు బిల్లు రావాలి" అని చెబుతూ కుడి చేతిలో త్రిబుల్‌ఫైవ్ సిగరెట్ ప్యాకెట్, లైటర్ ఆయనవైపు పెట్టి "ఇఫ్ యు డోంట్ థింక్ అదర్‌వైజ్ హావ్ ఇట్" అన్నాడు సిమెంట్ రిప్రజెంటేటివ్.

"నో సారీ" అన్నారాయన.

అతను రింగులు రింగులుగా పొగ వదులుతుంటే మేనేజర్‌గారికి అసహనంగా ఉంది.

తను కోరుకున్న అప్సరసలాంటి స్త్రీకి మరొకడు బీట్ వేస్తుంటే ఎంత కోపంగా ఉంటుందో అంత కసిగా ఉందాయనకు. మంటెక్కిపోతోంది. అసలు తన ఈ చిత్రహింసకు కారణం ఏ.వి.రావే. ఏదో ఒకటి చేయాలి అనుకున్నారాయన. బెల్ కొట్టి అప్పారావ్‌ని పిలిచారు.

"ఈయనను ఏ.వి.రావ్ దగ్గరకు తీసుకువెళ్లు. అలాగే సిబ్బంది గుమస్తాని పిలువు" అన్నారు రుసరుసలాడుతూ.

పోలీసుల లాకప్ రూమ్‌లోకి తీసుకువెళ్తున్న నేరస్తునిలాగా ముఖంమీద ఫీలింగ్స్‌తో సిబ్బంది గుమస్తా మేనేజర్‌గారి కేబిన్‌లోకి అడుగుపెట్టాడు. వెంటనే బయటకు వచ్చేసాడు. మరి ఆయనేం చెప్పారో?

ఒక గంట గడిచింది.

సిమెంట్ కంపెనీ రిప్రజెంటేటివ్ మేనేజర్‌గారి కేబిన్‌లోకి ప్రవేశించి త్రిబుల్ ఫైవ్ సిగరెట్ ప్యాకెట్స్ ఒక డజను, లైటరు ఆయన ముందు పెట్టాడు.

"సర్! నన్ను క్షమించండి స్వతంత్రం తీసుకున్నందుకు. ఎవరో ఏదో చెప్తుంటారు. మనం వినేస్తే ఎలాగ చెప్పండి? మీలాంటి ఎగ్జిక్యూటివ్స్ స్మోక్ చేయకపోతే ఎలాగండి బాబూ... బుర్ర వేడెక్కిపోదూ. అయినా అది మీ డిగ్నిటీకి మస్ట్ అండీ బాబూ. హేవ్ ఇట్" అంటూ ఆయన నోట్లో సిగరెట్ పెట్టి లైటర్‌తో వెలిగించాడు.

ఇంతలో ఏ.వి.రావ్, సిబ్బంది గుమాస్తా, బడ్జెట్ గుమాస్తా, అటెండర్ అప్పారావు కేబిన్‌లోకి వచ్చారు.

"మీరు సిగరెట్లు కాల్చండి బాబూ... మానేసారంటే మేం చచ్చిపోతాం" అన్నారు ముక్తకంఠంతో.

"నాకు ప్రమోషన్ వచ్చినప్పుడు కూడా ఇంత రిలాక్స్ అవలేదోయ్" అంటున్నారాయన.

ఆయన ముఖంలో ఒలింపిక్స్ గోల్డ్‌మెడల్ గెలిచినంత సంబరం కనిపిస్తోంది.

★

## డ్రగ్స్ మత్తులో అమెరికా

ప్రపంచానికి నీతులు చెప్పే అమెరికాలో గోధుమ, మొక్కజొన్న పంటలకన్నా ఎక్కువ ఆదాయం వచ్చే పంట మార్జువానా! ఈ చట్టాన్ని సంస్కరించే జాతీయ సంస్థ మాజీ డైరెక్టర్ జాన్ గేట్‌మేన్ అంచనా ప్రకారం కేవలం కాలిఫోర్నియాలోనే ఏడాదికి 13.8 బిలియన్ డాలర్ల మార్జువానా పండుతోందిట. అమెరికాలో చట్ట విరుద్ధంగా ఏడాదికి 200 బిలియన్ డాలర్ల విలువైన డ్రగ్స్ వాడుతున్నారట. వాటిని నిషేధించాలని ఆరేళ్లపాటు కోర్టుల్లో వాదించి ఓడిపోయానంటున్నాడు గేట్‌మేన్.

## అడుగంటిపోతున్న విద్యా ప్రమాణాలు

కోణార్క్ ఉత్తరప్రదేశ్‌లో వుంది, బ్రిజ్ మహరాజ్ భరతనాట్యం చేస్తారు... ఇలాంటి అవాకులు చవాకులు గుజరాత్ రాష్ట్రంలో పదో తరగతి ఇంగ్లీషు, హిస్టరీ పుస్తకాల్లో కోకొల్లలు. ఇక నందాదేవి మందాదేవిగా, ఫెయిర్‌ప్రయిస్ పెయిర్ ప్రయిస్‌గా, జండర్ సెన్సిటివిటీ జెండర్ సేనిటేషన్‌గా స్పెల్లింగ్ మిస్టేక్స్ ఎన్నో ఉన్నాయి. పిల్లలు వీటిని యధాతథంగా పరీక్షల్లో వ్రాస్తే ఈ తప్పుల తడకలవల్ల మార్కులు పోతాయని ఓ భయం. ఆ పుస్తకం ఆధారంగా పరీక్షలకు తయారైతే సరైన జవాబులు వ్రాసినా ఎగ్జామినర్లు మార్కులు వేయరేమోనని మరో భయం. చివరికి ఓ టీచర్ తెగించి ఈ సంగతిని విద్యాశాఖామంత్రికి, సెక్రటరీకి తెలియజేస్తే ఇంతవరకూ అతీగతీలేదు. పరీక్షలు వచ్చేస్తున్నాయి. ఏం చేయాలో టీచర్లకు తెలియడంలేదు. పిల్లల విద్యాప్రమాణాలు పెరగడంలేదంటే ఆశ్చర్యమేముంది?

-తటవర్తి

